క్లుప్తంగా

నేడు వీఎంసీలో 'పీజీఆర్ఎస్'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ నగర వాసులకు అందించే మౌలిక వసతుల కల్పనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు – పరిష్కార(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో, సర్కిల్ కార్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర వీఎంసీ అధికారులు పాల్గొని నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు.

టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



పటమట(విజయవాడతూర్పు): ది విజయవాడ టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. పటమట హైస్కూలు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా ఫిరోజ్, అధ్యక్షుడు ఆంజనేయ దాసు, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శిగా జానీని సభ్యులు ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఇర్ఫాన్ బేగ్‌తో పాటు నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సూర్యోపాసన సర్వ శ్రేయస్కరం



విజయవాడకల్చరల్: సూర్యారాధన, సూర్యోపాసన సర్వవిధాల శ్రేయస్కరమని లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సూర్య నమస్కారాలు, అరుణ పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవంగా భక్తులు విశ్వసిస్తారన్నారు. సూర్యభగవానుని ఆరాధించే సంస్కృతి భారతీయ సనాతన ధర్మంలో ఉందని చెప్పారు. భారతీయులు పవిత్రంగా భావించే పండుగలన్నీ సూర్యమానంతోనే ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమాన్ని మేనేజర్ శర్మ నిర్వహించారు. ఋత్వికులు అరుణ పారాయణం చేశారు.

జీవీఆర్ నగర్‌లో భారీ అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఆర్‌నగర్ భక్తబృందం ఆధ్వర్యాన ఆదివారం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత భక్త బృందం సభ్యులు గద్దే శ్రీను అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాము ప్రతీ ఏటా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు, దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రతీ ఒక్కరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం 8 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తబృందం సభ్యులు నూతక్కి శ్రీను, గద్దే శేషబాబు, సీహెచ్ సుబ్బారెడ్డి, అర్జా నాంచారయ్య, చోడిశెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విజయకుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారం



విజయవాడకల్చరల్: విజయకుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో యువ కవి కారంచేటి విజయకుమార్ రచించిన కవితా సంపుటి కలువల కొలను కవితా సంపుటి ఆవిష్కరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ.. కవులకు సమాజమే కవితా వస్తువు అన్నారు. సమాజంలో నేడు జరుగుతున్న అనేక అంశాలకు కవి విజయకుమార్ అక్షర రూపం దాల్చారని తెలిపారు. కవిత్వంలో, సాహిత్యంలో సామాజిక చిత్రీకరణ ఉండాలన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణ రావు మాట్లాడుతూ.. కవులు సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలని సూచించారు. కవి విమర్శకుడు రామకవచం సాగర్ కవితా సంపుటిని ఆవిష్కరించారు. కవితా సంపుటి రచయిత విజయకుమార్ తనకు ప్రేరణ కలిగించిన అంశాలను తెలిపారు. కార్యక్రమాన్ని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి కందికొండ రవికిరణ్, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య నిర్వహించారు.

కలవర పెడుతున్న ఖాళీస్థలాలు

- ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్న దుస్థితి
- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిన వైనం
- ఖాళీ స్థలాలను మెరక చేయించటంలో విఫలమవుతున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు



దేవీనగర్ రైల్వే స్థలంలో నిల్వ ఉన్న మురుగు



జీవీఆర్ నగర్ ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న వర్షపు నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్, దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయకనగర్, గులాబీతోట తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు చెత్తా చెదారంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజలను కలవర పెడుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను మెరక చేయించటంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో ఖాళీ స్థలాలు ఏడాది పొడవునా నీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోతుండటంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పెరుగుతున్న దోమలతో కనీసం రాత్రిపూట కంటినిండా నిద్ర కూడా లేక స్థానికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. తాము ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఖాళీ స్థలాల్లో దోమలు పెరిగి తమకు నరకం చూపుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమల వల్ల తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామంటున్నారు. అనారోగ్యం బారిన పడటంతో విలువైన సమయంతో పాటు వృధాగా డబ్బులు ఖర్చుచేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ స్థలాలు మెరక చేయించాలి

దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారిన ఖాళీ స్థలాలకు అధికారులు చొరవ తీసుకోని మెరక చేయించాలని స్థానికులు కోరుతున్నారు. కనీసం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారంతోనైనా ఖాళీ స్థలాలలో నీరునిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలంటున్నారు. రహదారులపై భవన నిర్మాణాలకు రోడ్లపై ఇసుక, కంకర వేస్తే వాలిపోయే అధికారులు ఖాళీ స్థలాలపై చర్యలకు మాత్రం కన్నెత్తైనా చూడటం లేదని ఆరోపిస్తున్నారు. స్థలాల రేట్లు పెరుగుతుండటంతో తమ స్వలాభాలకోసం రియల్టర్లు, వ్యాపారులు స్థలాలను కొనుగోలు చేసి ఖాళీగా వదలివేస్తున్నారు. రేటు పెరిగినపుడు చూద్దామంటూ కనీసం ఈ స్థలం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో



జీవీఆర్‌నగర్‌లో సంచారిస్తున్న పందులు

ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోవటమే కాకుండా దోమల పెరుగుదలకు దోహదపడుతున్నాయి.

రైల్వే ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు

పుండు మీద రోకటిపోటులాగా ఇక్కడి రైల్వే ఖాళీ స్థలాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. స్థానిక దేవీనగర్, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయకనగర్, మధురానగర్ సమీపంలోని రైల్వే ఖాళీ స్థలాలలో నిత్యం నీటి నిల్వలతో చెరువులను తలపిస్తున్నాయి.

ఇళ్లలోకి చొచ్చుకొస్తున్న విష సర్పాలు

ఖాళీ స్థలాల వల్ల విషసర్పాలు కూడా పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల రాత్రి వేళల్లో బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే విష సర్పాలు పలుమార్లు ఇళ్లలోకి ప్రవేశించాయని, దీనివల్ల తమకు రక్షణ కరువైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలపై దృష్టి సారించి, తమ ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

'కోటి సంతకాల కార్యక్రమం జయప్రదం చేయండి'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అవుతు శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతి పేద వాడికి కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఎంతో మందికి ప్రాణదానం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్ జగన్ జిల్లాలో మెడికల్ కాలేజీ చొప్పున 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారన్నారు. కరోనా రెండేళ్లు పోను మిగిలిన మూడేళ్లలోనే ఐదు కాలేజీల నిర్మాణం పూర్తి చేసి అడ్మిషన్లు కూడా ప్రారంభించారన్నారు. మరో రెండు కాలేజీలు పూర్తి చేసి అడ్మిషన్లకు సిద్ధం చేశారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రకరకాల సాకులు చెబుతూ కాలేజీలను ప్రైవేటుకు పీపీపీ విధానంలో అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ప్రజా ఉద్యమ నిర్మాణానికి నడుంబిగించిందన్నారు. ఇందులో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. విద్య, వైద్యం ప్రభుత్వం రంగంలోనే ఉండాలని, కళాశాలల ప్రైవేటీకరణ జీవో రద్దు చేయాలని తమ సంతకాల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు.

కూటమి పాలనలో అవినీతి రాజ్యమేలుతోంది

- 28వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ
- నయ వంచకుడు చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని.. ఏ చిన్న పని కావాలన్నా కాసులులేనిదే పనులు జరగటం లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 28వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదని.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో విద్య, వైద్యంను నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతీ నిరుపేదకు కార్పొరేట్ విద్య, వైద్యాన్ని అందించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత విద్య, వైద్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని... దీని వల్ల నిరుపేదలకు విద్య, వైద్యం అందని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు

డివిజన్‌లో రూ.23 కోట్లతో సంక్షేమం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 28వ డివిజన్‌లో 7,592 మందికి రూ.23 కోట్ల 11లక్షల 56వేల 676 సంక్షేమాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని మల్లాది విష్ణు అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన చరిత్ర జగన్మోహన్‌రెడ్డిది కాగా.. ఏమీ చేయకుండానే అన్ని హామీలు అమలు చేశానంటూ ప్రజలను మభ్యపెట్టే చరిత్ర చంద్రబాబుదని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ అంటూ గొప్పలు చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వంలో టీడీపీ నేతలు అందిన కాడికి దండుకుంటున్నారని.. లంచం లేనిదే ఏ పనీ జరగటం లేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవినీతిరహితంగా పారదర్శక సేవలు అందించామని గుర్తుకు చేశారు.

ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ఆరాటం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ప్రభుత్వ వైద్య కళాశాలను తీసుకువచ్చి పేదలకు మేలు చేయాలని చూస్తే..చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ఆరాట పడుతున్నారని విష్ణు ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్య కళాశాల వల్ల పేదలకు వైద్య విద్య, వైద్య సేవలు అందే అవకాశం ఉందని.. ప్రైవేటుకు అప్పగించటం వల్ల పేదలకు వైద్య విద్య దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైద్య కళాశాలలకు నిధులు లేవని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ -2 అధ్యక్షుడు భోగాది మురళి, నాయకులు కనపర్తి కొండ, వేదాంత చైతన్య, దాసరి చిన్నారావు, కగ్గ పాండు, మజ్జి కుమార్, అవాల బుజ్జి, ఆచారి, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



అజిత్‌సింగ్‌నగర్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాకు దూరంగా ఉంటూ, మంచి మార్గంలో నడవాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

400 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, డాక్టర్ ఎంజే నాయుడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోగుల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు ఆస్పత్రి 39వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. అనంతరం మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన వైద్యాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఇదే విధంగా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ శిబిరంలో ఎముకల సాంద్రత పరీక్షతో పాటు బీపీ, షుగర్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్ నిపుణులు శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి ఎండీ మాధవి, చైర్మన్ డాక్టర్ ఎంజే నాయుడు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు కూటమి చేస్తున్న అన్యాయాలపై పోరాడాలి




నాగేశ్వరరావు, వెంగయ్యలను సన్మానిస్తున్న విష్ణు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ హయంలో బీసీలకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందని.. రాష్ట్రంలోని బీసీల గళాన్ని ఒక్కటిగా వినిపించేందుకు వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అలుపెరుగని పోరాటాలు సాగించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శులుగా ఎంపికైన బంకా నాగేశ్వరరావు, మానం వెంగయ్య ఆదివారం విష్ణును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విష్ణు వారితో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో బీసీలకు అన్ని రంగాలలో సముచిత స్థానం లభిస్తే.. నేడు కూటమి ప్రభుత్వ హయంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం నాగేశ్వరరావు, వెంగయ్యలను సన్మానించారు. బంకా బాబీ, కృష్ణ, రాంబాబు, బత్తుల నారాయణ, మహేష్, శంకర్, రాజేంద్ర, సుధాకర్, వేమయ్య పాల్గొన్నారు.

కనులపండువగా ప్రభ మహోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని.. ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక 31వ డివిజన్‌లో శ్రీకనకదుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అమ్మవారి ప్రభ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. లోక కళ్యాణార్థం ప్రతీ ఏటా ప్రభ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాలు, బేతాళ సెట్టు, కోలాట నృత్యాలతో సాగింది. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు కలవకొల్లు వెంకటేశ్వరరావు, నక్కా శ్రీను, గాదె బుజ్జి పర్యవేక్షించారు.

రావి కృష్ణారావు సేవలు నిరుపమానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా ఎన్నికైన రావి కృష్ణారావు సేవలు నిరుపమానమని పలువురు వక్తలు కొనియాడారు. ఏలూరు రోడ్డులో ఆదివారం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఫాస్ట్ గవర్నర్ చిన్న రామకృష్ణ అధ్యక్షతన రావి కృష్ణారావు సత్కారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎంవీ రావు, మురళీ మోహన్, పాస్ట్ గవర్నర్‌లు ఎంఆర్ఎస్ ప్రకాశరావు, గంగాధర్, ఎలెక్ట్ గవర్నర్ కె.శ్రీనివాస్ రాజు, నగరానికి చెందిన పలు వాకర్స్ అసోసియేషన్ క్లబ్‌ల ప్రతినిధులు రావి కృష్ణారావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్నం రామకృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా రావి కృష్ణారావు మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో వాకర్స్ క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేసి బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వాకర్స్ నాయకులు పాల్గొన్నారు.


బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీ శృంగేరి శారదపీఠంలో ఆదివారం సత్యనారాయణపురం బ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సేవా సంఘం గౌరవాధ్యక్షుడిగా కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి, అధ్యక్షుడిగా తణుకు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఈమని శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి కొప్పవరపు మారుతి, జాయింట్ సెక్రటరీ పింగళి వెంకటేశ్వరరావు, కోశాధికారి గానుగపాటి పాండురంగ వరప్రసాద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సేవా సంఘం గౌరవాధ్యక్షుడు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. పేద బ్రాహ్మణులకు చేయూత అందించే దిశగా ఇప్పటికే తమ సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక వనసమారాధనలు, కుంకుమ పూజలు, ఉపనయనాలు, మెడికల్ క్యాంపులు తదితర అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్రాహ్మణులంత సఖ్యతగా ఉండాలన్నదే తమ సేవా సంఘం ముఖ్య ఉద్దేశమన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు.

గాయని శ్రీదేవికి సుస్వరగాన ప్రవీణ బిరుదు ప్రదానం



విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి, స్వరఝరి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గాయనీ గాయకులు ఆపాత మధురాల పేరుతో పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు అంజిబాబు, చరణ్‌రాజ్, అంజుస్వామి, స్వామి, వై.ఏసుబాబులు గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాయనీ గాయకులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. గాయని శ్రీదేవికి సుస్వరగాన ప్రవీణ బిరుదుతో సత్కరించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బోడి ఆంజనేయరాజు, సింగంశెట్టి చంద్రశేఖర్, గోళ్ల నారాయణ రావు, డాక్టర్ కమ్ముల రవిశేషుకుమార్, బీవీ వీరభద్రరావు గాయని శ్రీదేవిని అభినందించారు.

ఎంబీ స్టేడియాన్ని ఆధునికీకరించాలి



నినాదాలు చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, వాకర్లు, క్రీడాకారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియాన్ని అధునాతన వసతులతో ఆధునికీకరించాలని డీవైఎఫ్ఐ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కే నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఎంబీ స్టేడియం గ్రౌండ్‌ను ఆధునీకరించాలని కోరుతూ ఆదివారం నిరసన, బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నిజాముద్దీన్ మాట్లాడుతూ.. స్టేడియాన్ని ప్రైవేటు, ఇతర కార్యక్రమాలకు తరచూ ఇవ్వటం వల్ల స్టేడియం గ్రౌండ్ అంతా గోతులమయంగా మారి వాకర్స్, క్రీడాకారులకు అక్కరకు రాకుండా పోతుందన్నారు. గోతులమయమైన మైదానంలో కొద్దిపాటి వర్షం పడినా ఆ నీరంతా గ్రౌండ్‌లో నిలిస్తోందని చెప్పారు. ఈ ప్రభుత్వ పాలకులకు, కార్పొరేషన్ అధికారులకు ప్రైవేట్ కార్యక్రమాలకి అద్దెలకిచ్చి డబ్బు సొమ్ము చేసుకోవడంపైన ఉన్న శ్రద్ధ స్టేడియం ఆధునీకరించడంపై లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత వహించి స్టేడియంలో డస్ట్ పోయించి మెరక చేసి లెవలింగ్ చేయించాలన్నారు. వాకర్లు వర్షాకాలంలో కూడా నడవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్ బ్రిక్స్‌తో ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, వాటర్ ట్యాప్‌లు ఏర్పాటు, పాడైపోయిన ఆర్ఓ ప్లాంట్‌ను బాగుచేయించి శుద్ధి చేసిన మంచినీటిని అందించాలని కోరారు. డీవైఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రసూల్, రోహిత్, శ్యామ్, వెంకటేష్, వాకర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో మానసిక ఆరోగ్యం ముఖ్యమే

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవ జీవితంలో శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం అంతే ముఖ్యమని ప్రముఖ మానసిక వైద్యుడు ఆర్కే అయోధ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా మానసిక ఆరోగ్యం – రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యత అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అయోధ్య మాట్లాడుతూ.. ప్రతి వంద మందిలో 15 నుంచి 20 మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. శాస్త్రీయమైన వైద్య విధానమే ఉత్తమమని డాక్టర్ అయోధ్య సూచించారు. యాంగ్జైటీ, డిప్రెషన్, ఫోబియోలతో పాటు మత్తు పదార్థాలు, మద్యపానం, గుట్కా, ధూమపానం వంటి వాటికి బానిసలు అవడం కూడా మానసిక సమస్యలుగా గుర్తించాలన్నారు. ఆత్మహత్యలు, హత్యలు కూడా మానసిక ఉన్మాద చర్యలుగానే భావించాలని చెప్పారు. ప్రశాంత జీవన విధానం, వ్యాయామం, యోగా, మెడిటేషన్, చక్కటి ఆహారపు అలవాట్లు, రోజుకు 8 గంటల నిద్ర, వివాదాలకు దూరంగా ఉండటం, సంతృప్తికరమైన జీవితం వంటి దిన చర్యల ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు చారుగుళ్ల రమేష్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి ఉదయ్‌కుమార్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం సీతారాంపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యాన నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొనాలని మల్లాది విష్ణు పిలుపునిచ్చారు.